




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -17-

"మన చలం – మహా చలం.
నిరంతరాన్వేషి. విశ్వప్రేమిక రుషి.
ఎలా నిలుస్తాడు మన మధ్య,
మల్లెపూల మమతల్నీ, చిరునవ్వుల వెలుగుల్నీ కోరే చలం.
కవి చలం.
ఎందుకు నిలుస్తాడు మన మధ్య.
ఈ సందులలో, ఈ గొందులలో,
బందీలమైన మన మధ్య ఎలా నిలుస్తాడు ఆ చలం!?"

ఈ కవిత రాసింది. చలంగారికి అత్యంత సన్నిహిత మిత్రులు చిన్నారావు గారు.

చలం. ఒక చలం. ఒకే ఒక్క చలం. సమూహంలో ఒంటరిగా నిలిచిన చలం. ఒక్కడే అయినా ఏక వ్యక్తి సేనగా 5 దశాబ్దాలుగా తన రచనాలనే భీషణాయుధాలుగా చేసి, భావ విప్లవాన్ని కొనసాగించిన సాహితీ యోధుడు చలం– గుడిపాటి వెంకట చలం. !!

చలంగారు 1979 మే 4 వ తేదీ రాత్రి 9.05 గంటలకు ఈ లోకాన్ని విడిచారు. 5 వ తేదీ హైదరాబాద్ ఆ ఆకాశవాణి ప్రాంతీయ వార్తల్లో ఆ సమాచారాన్ని ప్రజలకు చేరవేశారు. దాని ఆధారంగా కొన్ని పత్రికలూ ఆ రోజు సాయంకాలం ప్రత్యేక ఎడిషన్లు ప్రచురించాయి. ఆ తరువాత మే 6 వతేదీన అరుణా చలంలో చలంగారి అంత్యక్రియలు జరుగుతుండగా ఆంధ్రదేశంలోని తెలుగు పత్రికలన్నీ చలంగారి గురించి ప్రత్యేకమైన వార్తలు, ప్రత్యేకమైన సంపాదకీయాలూ ప్రచురించాయి. విచిత్రమైన విషయం ఏమిటంటే, తెలుగు పత్రికలు తప్ప, ఇంగ్లీష్ పత్రికల్లో, లోపల పేజీల్లో కూడా చలంగారి వార్తలు రాకపోవడం అనేది గమనార్హం. ఎందుకంటే, ఇంగ్లీష్ పత్రికలు హైదరాబాద్ నుండి వెలువడుతున్న పత్రికలు వున్నాయి. హిందూ దినపత్రికలో మాత్రం ఆ వార్తను చాలా క్లుప్తంగా రాశారు. ఆ విషయం అలా ఉంచితే, తెలుగు 4 పత్రికల్లోని వార్తల్లోని కొన్ని అంశాలు ప్రస్తావించుకుందాం. ఆంధ్ర జ్యోతి లో నండూరి రామ్మోహన్ రావు గారు సంపాదకీయం రాశారు. అందులో నుండి కొన్ని పేరాలు.

***“అసాధారణ రచయిత”***

“చలంగారిని పోలిస్తే, ఒక నిర్నిద్ర సముద్రంతో పోల్చాలి. ఒక మహా జలపాతంతో పోల్చాలి. ఒక ఝంఝానిలంతో పోల్చాలి. చలం గారి అస్తమయంతో ఒక సముద్రం స్థంభించినట్లు, ఒక జలపాతం నిశ్చలం అయిపోయినట్లు, ఒక ఝంఝానిలం శాంతించినట్లు... 60 ఏళ్ళనాడు గుడిపాటివెంకట చలంగారు ఆంధ్రదేశంలో తెలుగు సాహిత్యంలో ఒక సుడిగాలి వలె, ఒక పెద్ద వరదవలె ప్రవేశించారు. సంఘంలో, సాహిత్యంలో, ప్రజల ఆలోచనలలో తరతరాలలో పేరుకుపోయిన కల్మషాన్ని కడిగి వేశారు. చెత్తా, చెదారం, దుమ్మూ, దుగరా ఎగరగొట్టారు. కొత్త గాలికి తలుపులు తెరిచారు. కొత్త భావాలకు లాకులు ఎత్తి వేశారు. ఒక గొప్ప రచయిత ప్రవేశం తర్వాత ఏ సాహిత్యం యధాతథంగా మిగలదు.

దాని స్వరూపమే మారిపోతుంది. దాని స్వభావమే మారిపోతుంది. సాహిత్యంపై అతడు తన ప్రభావాన్ని ముద్రిస్తాడు. చలం గారు చేసిన పని అదే. తెలుగు వచన స్వరూపాన్నీ, తెలుగు రచన స్వభావాన్నీ మార్చివేశారు. సమకాలీన రచయితల పైనా, ఆ తరువాత తరం వారి పైనా తన ప్రభావ ముద్ర వేశాడు. ఆ రోజుల్లో ఆయన గురించి రెండే రెండు అభిప్రాయాలు. విమర్శిస్తే అతిగా విమర్శించడం, లేదా అంతే గాఢంగా అభిమానించడం. మరొక అభిప్రాయం. అంటే, ఫరవాలేదు బాగానే రాస్తాడు అని గానీ, ఏదో రాస్తాడు లెద్దూ. అని చప్పరించి వేయడానికి వీలులేని రచనలు ఆయన చేశారు. “

ఈనాడు విషయానికి వస్తే... ఈనాడు 1974లో ప్రారంభమయ్యింది. 1979 గురించి మనం మాట్లాడుకుంటున్నాం. అప్పటికే ఒక సాంప్రదాయం కొనసాగుతున్నది. ఎవరైనా ప్రముఖ వ్యక్తులు చనిపోతే, మరొక ప్రముఖ వ్యక్తి తోటి సంపాదకీయం రాయించడం. ఆ తరువాత రోజుల్లో శ్రీశ్రీ గారు చనిపోయినపుడు 'వేటూరి' గారితో రాయించారు. చలంగారు చనిపోయినపుడు 'వేగుంట మోహన్ ప్రసాద్'గారితో రాయించారు. "మో"అని కూడా అంటారు ఆయన్ని. ముందుగా ఈనాడులో వచ్చిన వార్త

"చలం మహాభిష్క్రమణం "అనే శీర్షికతో వచ్చింది. అర్ధ శతాబ్దం పాటు ఆంధ్ర దేశాన్ని, తెలుగు సాహిత్యాన్ని, ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించిన శక్తి. తెలుగు సాహిత్యంలో ఝంఝూమారుతాలు సృష్టించి, విప్లవకెరటాలు లేపిన నవ భావాల సంచలనం గుడిపాటి వెంకటచలం. ఇక లేరు. చాలా కాలం చలం చేసిన అంతర్, బాహిర్ యుద్ధం ఇక ముగిసింది. దశాబ్దాల తరబడి మాటల్ని కత్తులూ, ఈటెలూ, మంటలుగా మార్చిన చలం చేతికి ఇదివరకే పక్షవాతం కమ్మింది. లక్షలాది మందిని ఆలోచింపజేసిన ఆయన మాట కూడా వారం రోజుల క్రితం పడిపోయింది. ఉద్యోగరీత్యా ఆంధ్ర దేశమంతా తిరిగి, సాహిత్యలోకంలో ప్రపంచమంతా నడచి, తెలుగు మాట్లాడే ప్రతిచోటా అసంఖ్యాకంగా అభిమానుల్ని సృష్టించుకొని, చివరికి తెలుగు వారికి దూరంగా, ఆధునిక ప్రపంచానికి అతీతంగా, అరవదేశంలో, అరుణాచలంలో మౌనమే వ్రతంగా పావు శతాబ్దం పైగా గడిపి, నిన్న అనంత విశ్వంలో కలసిపోయారు. "

ఇక సంపాదకీయం లోని కొన్ని మాటలు.

***నెత్తురూ, కన్నీళ్లూ కలిపిన కొత్త టానిక్ చలం***

"ఒక శతాబ్దం క్షణ కాలం ఆగిపోయింది. ఒక స్వప్నం వెన్నుముక విరిగింది. ఒక సంస్కారం అశ్లీలం పలికింది. ఒక ప్రపంచపు మాతృభాష అవాక్కయింది. ఒక సత్యం క్షణిక లౌక్యంతో అనృతాన్ని పలికింది. ఆయన పాత్రలు పద్మారాణీ, శశిరేఖా, అమీనా, పురూరవా, అరుణా మృత్యువును జయించాయి. స్త్రీ జనోద్ధరణ ఆయన ఆశయం. పూర్వ ఆదర్శాలకు పూర్తి వ్యతిరిక్తత ఆయన విప్లవ మార్గం. ప్రేమలేఖలూ, మ్యూజింగ్స్, ఆనందం, విషాదం, ఉత్తరాలూ, కవి హృదయం, మార్తా, జీసస్ జీవితం, భవద్గీత వీటన్నిటిలో చలం "కవి నామ్ కవి". భావ కవుల అమలిన శృంగారంలోని, మాలిన్యాన్ని ఎత్తి చూపి, తన నవలల్లో, నాటకాల్లో, కథల్లోని ప్రేమలోని నిసర్గ సౌందర్యాన్ని వెలిగించారు. అతని భావవాదం అంతటా సౌందర్య తృష్ణ, సంఘ సంస్కారాభిలాష దాక్కొని ఉంటాయి. ఉద్యమాభిముఖమైన గొప్ప అంతర్ముఖి చలం. ఈ శతాబ్దపు తెలుగు సాహిత్యానికి తిరిగి ఒక కొత్త ఊపిరినీ, రక్తాన్నీ, మాంసాన్ని ఇచ్చిన మహా రుషి. కవి. చలం."

ప్రత్యేకంగా మొట్ట మొదటి పేజీలో వేగుంట మోహన్ ప్రసాద్ గారు ఒక కవిత రాశారు.

చలం–

తెలుగు నేలమీద నీ వెలుతురు రమణాశ్రమం కొండెక్కి దీపమై వెలుగుతోంది.

అక్షరాక్షరాన నీ నగ్న రక్తం ఊజై, కన్నీళ్ళై,

చివరికి ఎవరికీ పట్టని ఎడారులై ఇంకిపోయింది దయగా.

బెంచీ మీద నించో మంటే, ఒంటేలుకి కెళ్ళి వస్తానన్న వాడివి.

మౌంటెన్ మీద నిల్చోని పండిపోయావు చలం. "–మోహన్ ప్రసాద్.

తెలుగు పత్రికలన్నిటిలోకి ప్రముఖంగా చెప్పుకోవాల్సింది ఆంధ్ర ప్రభ. వార్తలు ప్రచురించేటప్పుడు ప్రధానమైన వార్తను ప్రచురించేటప్పుడు దాని హెడ్డింగును "పతాక శీర్షిక"అంటారు. దాని తరవాత చిన్న చిన్న హెడ్డింగ్స్ ఉంటాయి. ఆంధ్ర ప్రభ దిన పత్రిక మాత్రం చలం గారి నిష్క్రమణని పతాక శీర్షికలో ప్రచురించింది.

***కామియై, మోక్షగామి అయిన అభినవ వేమన, గుడిపాటి వెంకట చలం అస్తమయం.***

చూసింది చూసినట్లు, చేసింది చేసినట్లు, అనుభవించింది అనుభవించి నట్లు, నమ్మినటువంటి దాన్ని జంకూ బొంకూ లేకుండా నీళ్లు నమలకుండా దాడిగా, వేడిగా కుండా బద్దలు కొట్టినట్లుగా రాసిన చలం, తనువుతో, మనసుతో, ఆత్మతో, స్త్రీని ప్రేమించి, ఆరాధించి, కీర్తించిన చలం. మూఢ సంప్రదాయాల కబంధ బంధనాల నుంచి స్త్రీని విముక్తి చేయడానికి జీవితమంతా తపించిన చలం. కుహనా ఆదర్శాలతో, కాపట్యంతో, కుళ్ళుపోయి, మడికట్టుకున్న సభ్య సమాజాన్ని తన కత్తి లాంటి కలంతో చీల్చి చండాడిన చలం. స్త్రీలో ఈశ్వరుడ్ని, ఈశ్వరుడిలో స్త్రీని దర్శించి, వేమనలాగ తొలుత కామియై, పిదప జ్ఞానియై, మోక్షగామి అయిన చలం. తిరువణ్ణామలైలో రమణస్థాన్ లో కాలధర్మం చెందారు. 84 ఏళ్ళ వయసులో ప్రకృతి ధర్మాన్ని అనుసరించి, పండుటాకు వలె రాలిపోయారు."

ఆంధ్ర భూమి ఏం రాసిందో చూద్దాం. దాని సంపాదకుడు గోరా గారు. ఈ గోరా గారు 1940 ప్రాంతాలలో చలంగారికి శిష్యుడు లాగ ఉండేవారు. ఆయన రాసిన వార్త.

"రాజకీయాలే మన ఊపిరి. అదే మన దైనిక ఆహారం. ఇది కలియుగం అవునో, కాదో గానీ, నిస్సందేహంగా రాజకీయ యుగం. విలువలు ఈ తీరుగా వున్నాయి కనక, క్రిందటి శుక్రవారం తిరువణ్ణా మలై లో 85 సంవత్సరాల వృద్ధుడు మరణిస్తే, దేశం సంగతి అటుంచి, మన రాష్ట్రం కూడా అంతగా పట్టించుకోలేదు. ఆ వృద్ధ మూర్తి పేరు గుడిపాటి వెంకట చలం తెలుగు సాహితీ లోకానికి చలం అనే కలం పేరుతో సుమారు అర్ధ శతాబ్దం నుండి ప్రసిద్ధుడు. గుడిపాటి వెంకట చలం గనక బ్రిటన్ లో పుట్టి ఉంటే, ఆయన అంత్యక్రియలు "వెస్ట్ మినిస్టర్"అనే చోట

జరిగివుండేవి. ఇంగ్లాండ్ లోని సాహితీ దిగ్దంతులకు అది రాజ్ ఘాట్. బ్రిటీష్ రాజ వంశీకుల సమాధి ప్రక్కనే, సాహితీ వేత్తల సమాధులు ఉంటాయి. చలంగారితో తుల్యుడైన ఇంగ్లీష్ రచయిత మరణించి ఉంటే, అక్కడ పత్రికలు రాజకీయ వార్తలు పక్కన పెట్టి, ఈ వార్తకు పతాక శీర్షిక ఇచ్చి ఉండేవి. అక్షరాస్యులైన బ్రిటీష్ వారందరూ కంట తడి పెట్టేవారు. తెలుగు దేశం, ఇంగ్లాండ్ కాదు.

చలం గారి మరణవార్తను తెలుగు దిన పత్రికలు మాత్రమే ప్రముఖంగా ప్రచురించాయి. ఇంగ్లీష్ పత్రికలు సింగిల్ కాలమ్ తో సరిపెట్టాయి. ఈ రకమైన ఉదాసీనత వల్ల, చలంగారి ఆత్మ క్షోభించదు. జీవించినంత కాలమూ, ఆయన ప్రచారానికి దూరంగా వున్నారు. నిరాడంబరంగా జీవించి, అంత నిరాడంబరంగానూ తనువు చాలించారు. అకాలమరణం అనడానికి వీల్లేదు. సహస్రమాసైక జీవి. జీవిత చరమాంకంలో రుజాభారంతో కృంగిపోయారు. ఒక రకంగా మృత్యువు ఆయన భారాలన్నిటికీ విముక్తి కలిగించింది.”

విచిత్రం ఏమిటంటే, ఏ స్త్రీ లోకం గురించి అయితే, ఆయన జీవించినంత కాలం తపించి, ఏ సాహిత్యాన్ని, ఏ స్త్రీ చుట్టూతా నడిపారో, ఆ స్త్రీ జాతి అంటే మహిళా సంఘాలు గానీ, మహిళా సమాజాలు గాని, మహిళా రచయిత్రులు గానీ చలంగారి గురించి  ఎక్కువగా రాయకపోవడం అదొక విచిత్రం. వనిత అనే పత్రికలో తుమ్మలపల్లి క్రిష్ణాభాయి గారూ, రంగనాయకమ్మ గారు తాను నడుపుతున్న పత్రికలో సంపాదకీయం ఇలా రెండు,మూడు వ్యాసాలు తప్ప. మహిళలు ఎవ్వరూ ఆరోజుగానీ, ఆ నెల గానీ రాయలేదు.

ఇవీ చలం గారి గురించి, ఆయన నిర్యాణం తర్వాత పత్రికల్లో వచ్చిన వార్తలు. తరువాత కొన్ని నెలల వరకూ కూడా, వార్తా పత్రికలూ, మాస పత్రికలూ, వార పత్రికలూ  చలం గారి మీద వ్యాసాలు ప్రచురించాయి. ఇక రమణ స్థాన్ ఎలా వుందో చూద్దాం.

కాలక్రమేణా అనేక చేతులు మారి ఆ ఇల్లంతా వేరే వాళ్ళ చేతుల్లోకి వెళ్ళిపోయింది. ప్రస్తుతం అయితే అప్పుడు చలంగారు ఉన్న ఇంటి స్థానంలో “ హేండ్ లూమ్ ఎగ్జిబిషన్ “ లాంటి షాపులు ఏవో వున్నాయి. చలం గారు అక్కడ వున్నారు అనడానికి నిదర్శనంగా, వాళ్ళ పెరట్లో వున్న “ఒక చేద బావి”ఒక్కటే ఉందని ఇటీవలే ప్రదేశాన్ని సందర్శించిన చలంగారి అభిమాని ‘హనుమంత రెడ్డి గారు’ చెప్పారు.

చలంగారి సమాధీ, రంగనాయకమ్మగారి సమాధీ పక్క పక్కనే కట్టారని చెప్పుకున్నాం కదా! కాలక్రమంలో నిర్మాణాల విస్తరణలో భాగంగా ఆ సమాధుల్ని తొలగించడం కూడా జరిగింది. ఒకానొక సమయంలో అంటే 1994-95 ప్రాంతాల్లో, చలంగారి అస్థికల్నీ, రంగనాయకమ్మ గారి అస్థికల్నీ చాలా జాగ్రత్తగా కాపాడి, నర్తకి గారు ఆ తరువాత దగ్గర్లోనే సమాధిని పునర్నిర్మాణం చేశారు. మరికొంత కాలానికి  అది కూడా విస్తరణలో భాగంగా ప్రమాదం వస్తే, అప్పటి తమిళనాడు గవర్నర్ గా ఉన్న రోశయ్యగారు దాన్ని మళ్ళీ పునరుద్ధరించి, వేరేచోట,

రహదారి పక్కనే సమాధి కట్టి, చుట్టూ ఒక చిన్న ప్రహరీ కూడా కట్టారు. మీరు ఇంటర్ నెట్ లో చూడవచ్చు. ప్రస్తుతం చలం గారి సమాధి ఎలా వుందో!

ఆ సమాధిని సందర్శించిన విశాఖపట్నానికి చెందిన ప్రముఖ రచయిత్రి, సంఘ సేవకురాలు, సాయి పద్మగారు ఒక కవిత రాశారు. ఆవిడతో మాట్లాడినప్పుడు, ఆవిడ  అరుణాచలం వెళ్ళినపుడు చలంగారి సమాధి కనుక్కోవడానికి ఎంత కష్ట పడ్డారో  చెప్పారు. ఆవిడ రాసిన కవిత సందర్భోచితంగా ఉంటుందని దానిని ప్రస్తావించుకుందాం

నువ్వు నీలా బ్రతికి,
మనసులో వున్నది మొహం మీద నిర్భయంగా చెప్పి,
సాహిత్యం నీ ముందు, నీ తర్వాత అని రెండు భాగాలుగా విడగొట్టావు.
ఇప్పుడు కూడా ఇంకా రెండు గానే వున్నారు వాళ్ళు.
నిన్ను అర్థం చేసుకున్నవాళ్ళు.
నీ సాహితీ నిర్భయత్వాన్ని అసూయతో అర్థం చేసుకోలేని వాళ్ళు.
ఎవరినన్నా కూడా క్షమించు, ప్రేమించు,
అని నా లాంటి వాళ్ళు చెప్పక్కరల్లేదు.
వాళ్లకి , నీ అక్షరంలోని జీవితం అర్థమైతే
వాళ్ళ త్రోవలో వాళ్ళే పడతారు.
ఇది నా ప్రార్ధన. "

ఇంక ఆ తరువాత రోజుల్లో చలంగారి కుటుంబ సభ్యుల విషయానికి వస్తే, చలంగారు లేని రమణస్థాన్ గువ్వ ఎగిరిపోయిన గూడు లాగ మిగిలింది. సింహం లేని గుహ లాగ నిలిచింది. ఆయనతో నివసించిన కుటుంబ సభ్యులు, ఆయన పరివారం, కొద్ది సంవత్సరాల పాటు అక్కడే వున్నారు. ఆ తరువాత వాళ్లంతా రకరకాల ప్రదేశాలకు తరలి వెళ్లి స్థిరపడ్డారు. ఆ వివరాల్లోకి వెళితే...

1982 సెప్టెంబర్ చివరలోనో, అక్టోబర్ మొదట్లోనో చలం గారి పెద్దమ్మాయి సౌరీస్, రమణ స్థాన్ నుండి భీమునిపట్నం వెళ్లిపోయారు. ఆమెతో పాటుగా చిక్కాల క్రిష్ణా రావుగారు, మరికొంత మంది కూడా భీమునిపట్నం వెళ్లిపోయారు. అక్కడే స్థిరపడ్డారు. చలంగారు జీవించి ఉండగా, తరచూ రమణస్థాన్ వెళ్ళే అభిమానుల్లో కొందరు ఆ తరువాత బీమునిపట్నం వెళుతుండేవారు. సుమారు 25 ఏళ్ళ పాటు ఆ సంప్రదాయం కొనసాగింది. సౌరీస్ గారు తన 85 వ ఏటా భీమునిపట్నంలో 2006 మే నెలలో అరుణాచలేశ్వరునిలో ఐక్యం అయిపోయారు.

చలంగారి రెండో అమ్మాయి నిర్మల. బొంబాయిలో ఉద్యోగ విరమణ అనంతరం, చిన్మయా మిషన్ కార్యక్రమాల్లోనే పూర్తిగా నిమగ్నమైపోయి, చివరి 25 సంవత్సరాలు, కోయంబత్తూర్ 'చిన్మయా మిషన్' ఆశ్రమంలోనే నివసించి, తన 95 వ ఏట, 2019 మార్చి 3వ తేదీన కోయంబత్తూర్ లోనే కన్నుమూశారు. సౌరీస్ గారూ, నిర్మల గారూ కూడా జీవితాంతం అవివాహితులుగానే ఉండిపోయారు.

మూడవ అమ్మాయి పకపక. తన భర్త వజీర్ రహ్మాన్ తో కలసి మద్రాస్ లో జీవించారు. ఆ తరువాత కుమార్తె షరీన్. (టిప్పు) వద్ద వుంటూ, అప్పుడప్పుడు తండ్రి జ్ఞాపకాలతో, బాల్యపు తీపి గురుతులతో, అరుణా చలం వెళ్లి వస్తుండేవారు. చివరకు పకపక అంటే, చంపక గారు 2018 నవంబర్ 20 న తన 83 ఏళ్ళ వయసులో అరుణాచలం లోనే మరణించారు.

తరువాత చలంగారి బెజవాడలో ఉండగా పెంపకం తీసుకున్న పాప చిత్ర – ఆమె రమణ స్థాన్ లోనే దాదాపు 1994 వరకూ వున్నారు. తరవాత తన సంతానం వద్ద ఉంటూ 2007లో 72 ఏళ్ళ వయసులో నర్సారావు పేటలో తన కుమార్తె వద్ద "కాకా"వద్ద మరణించారు.

1938 ప్రాంతాలలో తనకి 7,8 సంవత్సరాల వయసు ఉండగా చలంగారి కుటుంబంలోకి వచ్చారని చెప్పుకున్నాం కదా! నర్తకి గారు, ఆ తరువాత రమణ స్థాన్ లోని ఆశ్రమ వ్యవహారాలన్నీ కూడా చూసుకునేవారని అనుకున్నాం. ఆమె చలం గారు చనిపోయాక కొంత కాలం రమణస్థాన్ లోనే వున్నారు. తరువాత భీమునిపట్నం వచ్చారు. ఆ తరువాత తన పెంపుడు కొడుకుని చదివించడానికని తెనాలీ, విశాఖపట్నం వెళ్లారు. మళ్ళీ కొన్నాళ్ళు తిరువణ్ణామలై వెళ్లి, చివరకు తన 76 సంవత్సరాల వయసులో 2008లో భీమునిపట్నం లోనే కేన్సర్ తో కన్నుమూశారు.

ఇవి చలం గారి మొదటి తరానికి సంబంధించిన వివరాలు. ఇక రెండవ తరానికి చెందిన కుటుంబ సభ్యుల విషయానికి వస్తే...

పకపకా, వజీర్ రహ్మాన్ ల అమ్మాయి షరీన్(టిప్పు అంటారు). ఆమె ప్రస్తుతం బెంగళూర్ లో వుద్యోగం చేసుకుంటున్నారు. నర్తకి గారు పెంచుకున్న అబ్బాయి తంబి. ఆయన భీమునిపట్నంలో వున్నారు. చిత్ర గారి అమ్మాయిలు డాలీ, కాకా, కిట్టూ, మిస్రి (బుజ్జి). వీరిలో పెద్దమ్మాయి డాలీ, 2006లో సౌరీస్ గారి నిర్యాణానికి ఒక 10 రోజులు ముందుగా చనిపోయారు. ఆఖరి అమ్మాయి మిస్రి లేదా బుజ్జి – ఆమె చాలా యాదృచ్ఛికంగా తమ తాతగారి 40 వ వర్ధంతి రోజున మే 4 న తిరువణ్ణామలై లి నిద్రలో గుండెపోటుతో మరణించారు. ఈ కథనం జరుగుతున్న రోజుల్లోనే ఆమె లేరు అని తెలియడం విషాదం.

ఇక చిత్రగారి రెండో అమ్మాయి కాకా, మూడో అమ్మాయి కిట్టూ. వీళ్ళిద్దరూ హైదరాబాద్ లో వుంటున్నారు. కిట్టు గారితో నేను తరచూ మాట్లాడుతుంటానని మీకు తెలియజేశాను.

ఇవండీ చలంగారి సంతానం. వాళ్ళ గురించిన వివరాలు.

చలంగారు నివసించిన ఆ ప్రాంగణాన్ని 'రమణ స్థాన్' అనేవాళ్ళు. 'ఆశ్రమం' అనే వాళ్ళు. నిజానికి దాన్ని ఆశ్రమం అనేక న్నా 'కరుణాశ్రమం'అనవచ్చు. ఎందుకంటే, చలంగారు అక్కడ ఉన్నటు వంటి 30 సంవత్సరాల్లో ఆ ఆశ్రమంలో, ఆశ్రయం పొందిన వాళ్లూ, , చలం గారి, సౌరీస్ గారి సాన్నిధ్యంలో ప్రశాంతతను పొందిన వాళ్లూ, వాళ్ళతో కలసి జీవించిన వాళ్ళూ, ఏ మాత్రం అతిశయోక్తి లేకుండా 100, 150 మంది వుంటారు. ఆ సంవత్సరాల్లో, రమణ స్థాన్ లో ఉండడం అనేది ఒక అద్భుతమైన, అనిర్వచనీయమైన అనుభవంగా వాళ్ళందరూ భావించేవారు. అలాంటి విస్తృతమైనటువంటి కుటుంబ వ్యవస్థ , జగమంత కుటుంబం అంతకు ముందూ, ఆ తర్వాత ఇంకెక్కడైనా ఉండి ఉంటుందా? అనేది సందేహాస్పదమే. ఎక్కడి నుండో వచ్చిన వాళ్ళూ, అన్ని వయసుల వాళ్ళూ, అన్ని భాషల వాళ్ళూ, అన్ని జాతుల వాళ్ళూ ఎవరో...ఎవరో... ఎవరికీ తెలియదు. అక్కడకి రావడం, చలంగారి దగ్గరా, సౌరీస్ గారి దగ్గరా ఉండడం, అలాగే వచ్చిన వాళ్ళని కూడా "ఎక్కడ నుండి వచ్చారు? ఎప్పుడు వెళతారు?" అని అడిగేవారు కాదు. అదంతా కూడా ఒక పుష్పక విమానం లాగ, అక్షయ పాత్ర లాగ ఉండేది. అలాంటి ఆ ఆశ్రమంలో చలంగారి సాన్నిధ్యంలో, సాన్నిహిత్యంతో సేదతీరిన, జీవించిన కొంత మంది గురించి మాట్లాడుకుందాం.

ప్రముఖ రచయిత బుచ్చిబాబు గారు తన "చివరకు మిగిలేది" నవలలో ఒక మాట అంటారు. "మానవుడికి కావలిసింది. మతాలూ, దేవుళ్ళూ, మొక్కుబడులూ, రాజకీయాలూ కాదు. మానవుడికి కావలిసింది దయా, జాలీ కొంచెం. ఏకాస్తయినా చాలు. " అని. చలంగారి హృదయం ఎప్పుడూ కూడా అనంత దయా సాగరం. రమణస్థాన్ కి వచ్చిన డజన్ల కొద్దీ అభిమానులు ఒక ఎత్తయితే, 1969 మొదట్లో, 11 రోజుల పసిగుడ్డుగా చలంగారి చెంత చేరిన ఒక బాబు వృత్తాంతం అదొక్కటే ఒక ఎత్తు. ఆ వివరాల్లోకి వెళితే ...

1965, 66 నాటికి 25 సంవత్సరాల వయసున్న ఈ యువకుడు హనుమంత రెడ్డిగారు. ఆయనది అనంతపురం దగ్గర ఒక పల్లెటూరు. ఆయన అప్పుడు తిరుపతిలో ఎమ్మెస్సీ చదువుకుంటున్నారు. ఆ రోజుల్లో చలంగారి సాహిత్యాన్ని చదివి, చలంగారి మీద అభిమానం పెంచుకొని, తిరువణ్ణామలై వెళ్లి, ఒకసారి చలంగారిని కలిశారు. ఆ పరిచయం తోనూ, అభిమానం తోనూ తరచూ చలంగారిని కలుస్తుండేవారు. కర్నూల్ లో బి.యిడి లో చేరి, అక్కడ చదువుకుంటుండగా, మనం చెప్పుకోబోయే సంఘటన జరిగింది.

ఇప్పుడు మరో కీలకమైన వ్యక్తిని పరిచయం చేసుకోవాలి. ఆయన హనుమంతరెడ్డికి మిత్రుడు. ఆ మిత్రుడు ఒకసారి హనుమంత రెడ్డి దగ్గరకు వచ్చి, " నేను పెళ్ళి కాకుండానే తండ్రిని కాబోతున్నానని 7,8 నెలల క్రిందట

చెప్పాను కదా! బాబు పుట్టాడు. కాకపోతే ఇప్పుడు ఆ బాబుని పెంచుకోలేని పరిస్థితిలో వున్నాము. నీ సలహా కోసం వచ్చాను. ఈ బాబుని ఎవరికైనా ఇస్తే, పెంచుకుంటారేమో? నువ్వేమైనా సహాయం చేయగలవా? లేకపోతే ఈ బాబు గురించి ఏదో ఒక తీవ్రమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. "అని ఆ మిత్రుడు హనుమంతరెడ్డికి చెప్పాడు. ఈ సంభాషణ జరిగేసరికి ఆ పసి బాబు వయసు కేవలం వారం రోజులు. వీళ్ళు కూడా కేవలం 25 సంవత్సరాల వయసు వున్న కుర్రాళ్లే. అప్పుడు హనుమంతరెడ్డి, ఆ మిత్రుడికి చెప్పాడు

"నువ్వు మరీ అంత ఎక్స్ ట్రీమ్ నిర్ణయాలు తీసుకోవద్దు. ఆ బాబుని ఎవరికైన అప్పగించే ప్రయత్నాలు చేద్దాం."

"అదేదో ఇప్పుడే చెయ్యాలి. నేను వారం రోజులు కూడా ఈ బాబుని సాకే పరిస్థితుల్లో లేను."అన్నాడు.

అప్పుడు హనుమంతరెడ్డికి వెంటనే స్ఫురించిన వ్యక్తి చలంగారు. రమణ స్థాన్ కి వెళ్ళినపుడు ఆయన చాలా మందిని చూశారు. రమణ స్థాన్ లో ఎవెరవరో ఆశ్రయం పొందడం ఆయనకు తెలుసు. అందుకని ఆ పసిగుడ్డుని అక్కడికే తీసుకెళ్దామనుకున్నారు. అయితే ఈ పసిబాలుడి పరిస్థితి వేరు. మరీ ఇంత పసి గుడ్డును చలం గారు స్వీకరిస్తారా? అంతకు ముందు బెజవాడలో ఉండేటప్పుడు అలాంటి పిల్లల్ని తీసుకున్నారు గానీ, ఇప్పుడు తీసుకుంటారా? అంత దూరం తీసుకు వెళ్ళాక, "మాకు కుదరదు"అంటే, అక్కడేం చెయ్యాలి? ఇలాంటి ప్రశ్నలేవి హనుమంతరెడ్డికి రాలేదు.

అది చలంగారి పట్ల ఆయన అభిమానులకు వున్న భరోసా. మరో రెండు రోజుల్లో రమణ స్థాన్ కి ఆ మిత్రుల ప్రయాణం ప్రారంభమయ్యింది. ఆ మిత్రుడు తన కొడుకును పొత్తిళ్ళలో హత్తుకుని రమణ స్థాన్ బయలుదేరాడు. చిన్న సంచిలో పాలసీసా, వేడి నీళ్లు, 4,5 జతల బట్టలు అంతే. ఆయనకు అసలు చలం ఎవరో తెలీదు. రమణ స్థాన్ ఏమిటో తెలీదు. తిరువణ్ణామలై ఎక్కడుందో కూడా తెలీదు. మిత్రుడు హనుమంత రెడ్డి సహాయం చేస్తాడనే నమ్మకం తోటి, ఆ పసిగుడ్డును తీసుకొని బయలుదేరాడు. మిత్రులు ఇద్దరూ ఆ పసి పిల్లాడితో కర్నూల్ బస్ స్టేషన్ చేరుకున్నారు. ఆ రోజల్లో ఆంధ్రా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. అక్కడ నుండి వాళ్ళ ప్రయాణం రమణ స్థాన్ కు ఎలా కొనసాగింది? అక్కడకు చేరాక చలం గారి స్పందన ఎలా వుంది? ఈ సంఘటనకు ప్రత్యక్ష సాక్షి అయిన హనుమంత రెడ్డి గారి మాటల్లోనే విందాం. ఆయన మాటలు వినే ముందు ఈ కథను ఇక్కడ కొంచెం ఆపి, వర్తమానానికి వద్దాం.

అప్పటి 25 ఏళ్ళ కుర్రాడు హనుమంతరెడ్డి గారి ప్రస్తుత వయసు 77 సంవత్సరాలు. కర్ణాటక లోని తుమ్కూరు లో ఒక రెసిడెన్షియల్ కాలేజీ లో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్నారు. ఆయనతో మాట్లాడి, ఈ విశేషాలు తెలుసుకోవడం జరిగింది.

మళ్ళీ ఒకసారి కర్నూల్ బస్ స్టేషన్ దగ్గరకు వెళదాం. హనుమంతరెడ్డిగారి మాటల్లో..

"కర్నూల్ నుండి వెల్లూరుకి డైరెక్ట్ బస్సు వుంది. వెల్లూరులో బస్సు మారి,అక్కడ నుండి తిరువణ్ణామలైకి వెళ్ళాం. అక్కడ "మోడరన్ హోటల్"అని ఏదో వుంది. సరిగ్గా జ్ఞ్యాపకం లేదు. అక్కడ దిగాం. " అన్నారు హనుమంత రెడ్డి.

"ఎవరెవరు వెళ్లారు? "అన్నాను నేను.

"నేనూ, ఆ బాబు తండ్రీ. అతను వెళ్లి, వేడి నీళ్లూ, పాలూ  తెచ్చేవాడు. నేనే కలిపి పట్టేవాడిని. "

"11 రోజుల పిల్లవాడిని ఎలా తీసుకువెళ్లారండి?"

"ఒళ్ళో పెట్టుకొని జాగ్రత్తగా తీసుకువెళ్ళాం. అక్కడ బాబుని పడుకోబెట్టి, నేను చలం గారి దగ్గరకు వెళ్లి,విషయం చెప్పాను.  "

"బాబుని ఎక్కడ వదిలేసి వచ్చారు?"అన్నారు చలం గారు.

" హోటల్ వాళ్లకి చెప్పాం. అక్కడ వున్నాడు. అంటే... పోయి తీసుకురండి"అన్నారు. ఇంకేం మాటా, మంతీ వేరే ఏం లేదు. వెళ్లి తీసుకువచ్చిన తరవాత, కాకా, కిట్టూ, నర్తకీ, రంగనాయకమ్మగారూ అందరూ వాళ్ళింటికి ఒక నిధి వచ్చినట్లుగా తీసుకున్నారు. నా లైఫ్ లో ఎప్పటికీ మరచిపోలేను. కర్ణుడిని గంగ ఆహ్వానించినట్లు అనిపించింది. అంతే, అప్పటికప్పుడు రంగనాయకమ్మగారు ఒక పాత చీర తాలూకా క్లాత్ తీసుకొని, చిన్న గౌను లాంటిది కుట్టి తీసుకువచ్చారు."అని చెప్పారు హనుమంత రెడ్డి గారు.

ఈ సంఘటన జరగడానికి సరిగ్గా 37 సంవత్సరాల క్రిందట బెజవాడలో ఇలాంటి సంఘటనే జరిగింది చలం గారి ఇంట్లో. రోజుల పసిపాపని హాస్పిటల్ లో ఉన్న పాపని చలం గారికి ఇస్తే, వాళ్ళు పెంచుకున్నారు. ఆమే "చిత్ర"అని గతంలోనే తెలుసుకున్నాం కదా! అయితే, అప్పటి పరిస్థితులు వేరు. ఆర్థికంగా ఇబ్బందులు లేవు. డాక్టర్ రంగనాయకమ్మ గారి ప్రాక్టీస్ బాగుంది. కానీ, ఇప్పటి పరిస్థితి వేరు. రమణ స్థాన్ లో వాళ్ళ పరిస్థితే 'రేపు ఎలా?"అనే ప్రశ్న వుంది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా 11 రోజుల పసిపిల్లాడిని ఏ మాత్రం సందేహం లేకుండా, వేరే ఆలోచన లేకుండా, తమలోకి పొదువు కోవడమనేది జాలీ, దయా, కరుణకి పరాకాష్ట అని చెప్పుకోవచ్చు. ఆ రోజు రాత్రి నర్తకి తన పక్కలోనే పడుకోబెట్టుకున్నారు. ఆ రోజు నుండి  ఆ బాబుకి ఆమె మాతృమూర్తి అయ్యారు. ఆ మరుచటి రోజున ఆ ఇద్దరు కుర్రాళ్ళూ ఆ బాబుని ఒకసారి దగ్గరకు తీసుకున్నారు. ఆ బాబు తండ్రి బాబు నుదిటి మీద ముద్దు పెట్టాడు. 'మళ్ళీ ఎప్పుడు చూస్తానో' అనుకున్నాడు. తర్వాత కర్నూల్ వెళ్లిపోయారు.

అక్కడ నుండి ఆ బాబు సంరక్షణ అంతా నర్తకి గారే చూసుకున్నారు. అయితే, మరీ రోజుల వయసు బాబేమో, అందుకని ఆరోగ్యం విషయంలో కొత్తలో చాలా ఇబ్బందులకు గురయ్యారు. వాళ్ళ ఇంట్లో ఒక ఆవు ఉండేది. దాని పాలు పడుతుంటే, ఆ రోజుల పసి బాబుకి పడకో, లేకపోతే సీసావాసన వచ్చేదో దూరంగా నెట్టేసేవాడు. అందుకని ఊర్లోకి వెళ్లి, ఒక బాలింతరాలు ఉంటే, ఆమెను బ్రతిమిలాడి, ఆమె దగ్గర నుండి పాలు తీసుకువచ్చి, కొన్నాళ్ళు

పట్టారు. ఆ తరువాత అవి కూడా ఆగిపోయేసరికి, మిల్క్ పౌడర్ పాలు పట్టడం ప్రారంభించారు. ఆ విధంగా రకరకాలు ప్రయోగాలు చేస్తూ, ఆ కుర్రవాడి ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, ఇంట్లో వాళ్ళందరూ చూసుకుండేవారు. ముఖ్యంగా నర్తకి కొడుకు లాగ చూసుకునేది. అయితే ఇలా రకరకాలుగా పాలు మారడం వల్లనో, ఏమో గానీ, ఇన్ఫెక్షన్ వస్తుండేది. అలా ఇన్ఫెక్షన్ వస్తున్నప్పుడు మోషన్స్ అవుతుండేవి.

అలా 4,5 రోజులు సార్లు జరిగాక, బాబుకి నెలరోజుల వయసులో, ఒక రోజు ఆ ఇన్ఫెక్షన్ ఒక తీవ్రమైన ఆ బాబుకి వాంతులూ, మోషన్సూ ఎక్కువ అయిపోయాయి. డాక్టర్ కి చూపించాలంటే, అక్కడ నుండి వీళ్ళు ఉంటున్న ప్రదేశం, వూరికి చాలా దూరం. ఆ వూరిలో "రాజ్య లక్ష్మి" ఒక చిల్డ్రన్ స్పెషలిస్ట్ వున్నారు. అక్కడకు ఈ బాబుని పంపించాలి. రాత్రి అవుతోంది. గాలీ, వానా. ఆ గాలీ, వానలో నర్తకి వెళ్ళలేదు. అప్పటికి చలం గారికి ఆరోగ్యం బాగుండడం లేదు. రంగనాయకమ్మ గారు కూడా మంచం మీద వున్నారు. అందుకని ఆశ్రమం లో వున్న ముగ్గురు మగవాళ్ళు కలసి, ఈ బాబుని తీసుకొని, బండిలో కూర్చోబెట్టుకొని, గాలీ, వానలో,ఆ డాక్టర్ రాజ్యలక్ష్మి దగ్గరకు వెళ్లారు. ఆమె బాబుని చూసి, "పరిస్థితి కొంచెం ప్రమాదకరంగా వుంది. నా దగ్గర సరైన సౌకర్యం లేదు. మీరు గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకువెళ్ళండి "అన్నారు.

అక్కడ నుండి గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకువెళితే, అక్కడ డాక్టర్ లేదు. రాత్రీ, పైగా గాలీ, వానా అప్పటి పరిస్థితి. వాళ్ళేమో "డాక్టర్ ఎవరైనా సర్టిఫికెట్ రాసి ఇస్తేనే గానీ, మేం తీసుకోము. ఎడ్మిషన్ టికెట్ ఉండాలి. మా అంతట మేము తీసుకోవడం కుదరదు. "అన్నారు. అక్కడకు దగ్గరలోనే, వీళ్లకు బాగా తెల్సిన ఒక సానిటరీ ఇనస్పెక్టర్ ఉంటే, ఆయనతో రికమండేషన్ చేయించి, మొత్తానికి ఆ జనరల్ హాస్పిటల్ లో జాయిన్ చేశారు. అక్కడ వాళ్ళు ఆ బాబుని చూశారు. ఏదో వైద్యం చేశారు. అయినా ఏమాత్రం వాంతులూ, విరోచనాలూ కట్టడి కట్టడి కాలేదు. యేవో మందులు ఇచ్చి, "ఈ బాబుని కలరా వార్డుకి తీసుకువెళ్ళండి."అన్నారు.

ఆ తెల్లవార్లూ ఈ బాబుకి తగ్గాలని ప్రార్ధనలు చేశారు. పొద్దున్నే కలరా వార్డుకి తీసుకువెళ్ళమని చెప్పాక, ఇక వాళ్ళు భరించలేక, నర్తకి గారి దగ్గరకు వెళ్లి "ఇలా అంటున్నారు వాళ్ళు. ఏం చెయ్యాలో తోచడం లేదు "అని చెప్పారు. నర్తకి గారు వెళ్లి, "కలరా వార్డుకి వద్దు. అక్కడకి వెళ్తే, ఏమవుతుందో?"అని, మళ్ళీ రాజ్యలక్ష్మి గారి దగ్గరకు తీసుకువెళ్లారు. "ఏమైనా సరే! మీరే చూడండి." అన్నారు. అలా 4 రోజుల పాటు రాజ్య లక్ష్మిగారు ఆమె ఇంట్లోనే ఉంచుకొని, ఆ బాబుకి చికిత్స చేశారు. మొత్తానికి గండం గడిచి బాబు ఆరోగ్యం మెరుగయింది. ఇదంతా ఆ బాబుకి నెలరోజుల వయసు ఉండగా. అంత జాగ్రత్తగా కంటికి రెప్పలాగా చూసుకున్నారు. అలా రోజుల బాబుగా వాళ్ళ ఇంటికి వచ్చిన ఆ బాబుకి "రమణ ప్రసాద్"అని పేరు పెట్టారు. ఎవరో చెప్పారు "క" అక్షరంతో పేరు మొదలైతే బాగుంటుందని. అందుకని "కళ్యాణ్"అని కూడా పెట్టారు. అయితే, ఇంట్లో వాళ్ళందరూ "తంబి"అని

పిలుస్తుండేవారు. ఆ తంబి బాలారిష్టాలు అన్ని కూడా అధికమించి, పరిపక్వమైన ఆరోగ్యంతో పెరిగాడు. ఆయన చలం గారికి ఎంత సన్నిహితుడయ్యాడంటే, చిన్న పిల్లాడిగా వున్నప్పుడే అత్యంత ఇష్టమైన వ్యక్తిగా మారి పోయాడు. చలంగారు పడుకునేటప్పుడు "తంబి పక్క, నా పక్కనే వెయ్యండి" అని తన పక్కనే వేయించుకునేవారు.

ఆ బాబుకి 5,6 సంవత్సరాల వయసు వచ్చేసరికి, అంటే, 74-75 ప్రాంతాలలో, చలంగారు చక్రాల కుర్చీకి పరిమితమైపోయారు. ఇంక ఆ కుర్రవాడు "నాకు కథలు చెప్పు నాన్నా!"అని అడుగుతుంటే, కథలు చెబుతుండేవారు. అలా తంబికి చెప్పిన కథలన్నీ "తంబికి చెప్పిన కథలు"అని రాశారు ఒకటి, రెండు వారాలు. అందరికీ అనుమానం వచ్చింది. "చలం గారు తంబి అని అంటున్నారు ఎవరీ తంబీ?" అని అప్పట్లో అందరూ అనుకున్నారు. చలంగారి బయటకు వెళ్ళినపుడు బయటకు తీసుకువెళ్ళేవారు. చలం గారు చాలా రోజులు అంటుండేవారట "వీడు ఇంతగా నాలో అతుక్కుపోయాడు. వీడ్ని చూడకుండా ఉండలేకపోతున్నాను. బహుశా ఆ కుర్రాళ్ళు ఇద్దరూ వచ్చి, మా అబ్బాయిని మాకు ఇచ్చేయండి. అని తీసుకుపోతారేమో" అని భయపడుతుండేవారట. అంతే కాకుండా ఆ కుర్రవాడితో అంటుండేవారట "అరే!నేను కుర్రవాడిగా వున్నప్పుడు నా దగ్గరకు రావచ్చు కదరా! ఇంకా ముందు వచ్చి ఉంటే, ఎంత బాగుండేది. "అని.

ఈ విధంగా చలంగారి అమృత హస్తాల మీదుగా పెరిగాడు తంబీ. చలం గారు చనిపోయేటప్పటికీ ఆ కుర్రవాడికి 11 సంవత్సరాలు. చలం గారు చనిపోయిన తరువాత, మిగతా వాళ్ళతో కలసి భీమిలి వచ్చేసాడు. ఆతరువాత నర్తకి గారు ఆ కుర్రవాడి చదువు కోసం తెనాలీ, విశాఖ పట్నం పంపించారు. ఆ కుర్రవాడు ఎమ్మెస్సీ సోషియాలజీ చేశాడు. ప్రస్తుతం ఆయన భీమిలి లో వుంటున్నారు. ఇప్పుడు 50 సంవత్సరాలు. ఆ తంబినే ఇప్పుడు మనతో తన అనుభవాలు పంచుకుంటున్నారు.

"నన్ను, మా ఫాదర్, మదర్ వాళ్లకు ఏవో కొంచెం కొన్ని ప్రాబ్లమ్స్ ఉన్నాయని, నేను పుట్టిన వెంటనే, ఎవరో రమణాశ్రమం చలం గారు వున్నారని,వాళ్ళ దగ్గరకు తీసుకువెళ్తే, నన్ను చూసుకునే అవకాశం ఉంటుందేమో అని అనుకొని నన్ను తీసుకువచ్చారు. తీసుకువచ్చిన వెంటనే, నర్తకి గారు "నేను తీసుకుంటాను" అన్నారు. నేను రావడం 'పిల్లాడు వచ్చాడని' అందరూ హేపీ ఫీలయ్యారు. ఆ రోజునుంచీ అక్కడే పెరిగాను. నన్ను 68లో తీసుకువచ్చారు. నాన్న 79 లో పోయారు. మేం "నాన్నా!"అని పిలిచే వాళ్ళం. అప్పుడు నాకు 11 ఏళ్ళు. నాకు వూహ తెలిసిన విషయాలు గుర్తుచేసుకుంటే – నేను నాన్న దగ్గర ఉండేటప్పుడు, ఆ ఇంటికి ఏం పేరు పెట్టాలో తెలియదు గానీ, సుమారు ఒక వంద మందికి తక్కువ లేకుండా ఉండేవారు. ప్రతిరోజూ ఆయన దగ్గరకు ఎవరెవరో వచ్చేవారు. అందరూ రకరకాల కష్టాలూ, బాధలతో వచ్చేవారు.

అక్కడ రెండు ఇళ్ళు ఉండేవి. ఆడవాళ్లు ఉండడానికి ఒక యిల్లు. మగవాళ్ళు ఉండడానికి ఒక ఇల్లు.'గెస్ట్ హౌస్' లాంటివి. కంటిన్యూగా ఉండేవారు. వాళ్ళ బాధలు చెప్పుకోవాడికి కావచ్చు. ఇంక దేనికైనా కావచ్చు

నా వరకూ వచ్చేసరికి నన్ను, నా తల్లీ, తండ్రీ అలా చూస్తారో లేదో నాకు తెలీదు గానీ, అంతకన్నా ఎక్కువగా చూసేవారు చలం గారు. నేనంటే, ఎంతో ప్రేమ ఆయనకు. అక్కడ వున్న ఆ వాతావరణం మొత్తంలో అంతా ఒక ఫ్యామిలీ లాగ ఉండేవాళ్ళం. నేను నాన్న దగ్గర పెరగడం ఎంత అదృష్టమో, అంత దురదృష్టం కూడానూ. ఆయన గొప్పతనాన్ని తెలుసుకునే లోపే వెళ్లిపోయారు. అంత గొప్ప వ్యక్తితో నేను కథలు చెప్పించుకునేవాడిని. "నాన్నా! కథలు చెప్పు"అనేవాడిని.ఏవేవో కథలు చెప్పేవారు. కథలు చెప్పిన తర్వాత ఆయనతో షికారుకు వెళ్ళాలి. నేను వెళదాం రమ్మని అడిగేవాడిని. ఆయనకు ఓపిక లేకపోయినా, ఆయన వీల్ చైర్ లో ఉండేవారు. మేం తోసుకుంటూ వెళ్లి, వచ్చేవాళ్ళం.

అలా వెళ్ళేటప్పుడు, ఏదైనా బిజినెస్ చేద్దాం అనుకున్నాం. బిజినెస్ అంటే ఏం లేదు. ఇంటి ముందు కూర్చొని వేరుశెనక్కాయలు అమ్మేవారు. "ఉడకబెట్టిన శెనక్కాయలు 10,5 పైసలకి కుప్పలుగా పోసి,మనం అమ్ముదాం." అని, నేనూ, నాన్నా ప్లాన్ వేసుకొని,పది రూపాయల ఖర్చుతో శెనక్కాయలు తీసుకొచ్చి, ఇంటి ముందు పెట్టి ,అమ్మేవాళ్ళం. కొంత మందికి ఫ్రీగా ఇచ్చేసేవాళ్ళం. రాత్రి లెక్కబెడితే ఆరు రూపాయలు వచ్చింది. సౌరీస్ గారు "మీరే వ్యాపారం చెయ్యక్కరలేదు. మీరు వ్యాపారం చేస్తే, రావడం మాట అటుంచి, వున్నది పోతున్నది. రోజూ ఇలా చేస్తే, ఇంట్లో ఇంకేమీ మిగలదు."అన్నారు. ఇదొక ఇన్సిడెంట్ నాకు గుర్తుంది. రెండోది ఏమిటంటే, ఆయన హాల్లో పడుకునేవారు. పక్కనే నేను పడుకునేవాడిని. నా బెడ్ కిందనే ఉండేది. నాన్న ఉదయాన్నే నాలుగు గంటలకే లేచిపోతారు. నాకు బాగా గుర్తుంది ప్రతి రోజూ "మృత్యుంజయ స్తోత్రం "చదివేవారు. ఆయన వాయిస్ చాలా అద్భుతంగా ఉంటుంది. చదివే విధానం కూడా చాలా చాలా బాగుండేది. ప్రతిరోజూ ఆ లాస్ట్ డేస్ వరకూ, అంటే ఆయన మాట పడి పోయేంత వరకూ నాకేం కావాలో చెప్పేవారు "తంబి ఏదో అడుగుతున్నాడు చూడండి." అనేవారు. ఒక విధంగా నాకు గిల్టీ ఫీలింగ్ లాగ ఉండేది. ఎందుకంటే ప్రతి రోజు కూడా "లైఫ్ ఫర్ ఎగ్జిస్టెన్స్ ".

అటు వంటి పరిస్థితుల్లో "నాకు అది కావాలి. ఇది కావాలి" అని అడిగినా, ఇంచు మించు తెప్పించేవారు. ఎవరు తెస్తారండి? నేను ఆ ఇంట్లో పుట్టిన పిల్లాడిని కాదు. బంధువుల పిల్లాడిని కాదు. ఎక్కడో, ఎవరో తీసుకువచ్చి ఇచ్చారు. అలంటి వాడిని అంత గొప్పగా చూసుకునేవారు. అందుకే నేను అదృష్టం అని కూడా అన్నాను. నా విషయంలో ఎప్పుడో ... ఎప్పుడో డిసైడ్ అయిన గొప్ప విషయం. నేను ఇలా వున్నాను అంటే ఫస్ట్ కారణం నాన్నగారూ, అమ్మ సౌరీస్ గారు. వాళ్ళు లేకపోతే, నేను లేను. నేను కర్నూల్ లో పుట్టాను. హాస్పిటల్ లో ఎవరూ

నన్ను తీసుకోకపోతే, నన్ను బయట పడేసి వెళ్ళిపోయేవారు. వాళ్ళు నన్ను ఆదరించి తీసుకోబట్టి కదా సార్ ! ఇవాళ నేను ఇలా వున్నది. నాన్నగారూ, మా అమ్మ నర్తకీ, అమ్మ సౌరీస్ గారు వాళ్ళు లేకపోతే నేను లేను."

"ధన్య వాదాలు తంబీ గారూ! చలంగారి అమృత హస్తాలతో, నర్తకి గారి మాతృ భావనతో పెరిగిన మీరు ధన్యులు. మీతో సంభాషించడం మాకు దక్కిన అరుదైన అవకాశం " ముఖ్యంగా పాఠకులతో ఒక విషయం పంచుకోవాలి. ఈ హనుమంత రెడ్డి గారూ, తంబి గారూ నాకు వాళ్ళతో మాట్లాడే అవకాశాన్ని, వారి యొక్క ఫోన్ నంబర్లనీ ఇచ్చి సహకరించిన స్నేహ కుటీర్ ట్రస్ట్ చైర్మన్ పాలడుగు రాజశేఖర్ గారికి ధన్యవాదాలు చెప్పుకోవాలి.

మొత్తం కరుణ రసాత్మకమైన వృత్తాంతంలో హనుమంత రెడ్డి గారూ, చలంగారి పరివారమూ, ముఖ్యంగా నర్తకి గారూ, వీరందరూ కూడా ఈ కథలో పాత్ర దారులే. నర్తకిగారితో దాదాపు దశాబ్దం పైగా, అనుబంధం కలిగినటువంటి డా:భార్గవి గారు, నర్తకి గారితో తనకు వున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ మనతో కాసేపు మాట్లాడారు. ఆమె మాటల్లోనే...

" నమస్కారమండీ! నా పేరు భార్గవి. నేను మెడికల్ డాక్టర్ని. చలం గారి గాఢాభిమానిని. చిన్నప్పటి నుండి ఆయన రచనలు చదువుతూ పెరిగాను. ఆయన్ని ఒక్క సారైనా చూడాలనీ, మాట్లాడాలనీ, ఆయన తిరిగిన ప్రదేశాలూ, ఆయన వర్ణించిన ప్రదేశాలూ, ఒకసారి దర్శించాలనీ. ఆయన కథల్లోనూ, మ్యూజింగ్స్ లోనూ, పాత్రలుగా దర్శనమిచ్చిన, నిజ జీవితంలోని వ్యక్తులను కలవాలనీ అనుకునేదాన్ని. కానీ, నేను మెడికల్ చదువుకునే రోజుల్లోనే ఆయన చనిపోయారని తెలిసింది. అప్పటిదాకా ఆయన్ని చూడగలనని ఆశ ఉండేది. అదింక నిరాశ అయిపోయింది. 1991 లో సౌరీస్ గారిని కలిశాను. భీమిలిలో మాట్లాడాను. అక్కడ వున్న చలంగారి ఫోటోలు చూశాను. 1994 లో నెల్లూరు హాస్పిటల్ కి మా వారిని వైద్యం కోసం తీసుకువెళ్లాల్సి వచ్చింది. అక్కడ నుండి తిరువణ్ణామలై దగ్గరని తెలిసి, ఇక్కడ వరకూ ఎలాగూ వచ్చాం, కనీసం చలంగారి సమాధి అయినా చూద్దాం అని తిరువణ్ణామలై వెళ్ళాం. అక్కడకు వెళ్లి "చలం గారి సమాధి చూడాలి "అని అడుగుతుంటే, "మాకు తెలీదు " అన్నారు.

నర్తకి గారి గురించి అడిగితే, రమణాశ్రమం వెనక్కి తీసుకువెళ్లి చూపించారు. అక్కడ నర్తకి 'డిస్పెన్సరీ' లో మందులు ఇవ్వడం లాంటివి చేస్తున్నది. మమ్మల్ని చూసి లేచి వచ్చింది. "మేం చలంగారి అభిమానులం "అని చెబితే, "ఇప్పుడా వచ్చేది." అని చాలా ఆప్యాయంగా మాట్లాడింది. తన గదికి తీసుకెళ్లి చూపించింది. "చలం గారి సమాధి ఏది?"అని అడిగితే, " ప్రస్తుతం సమాధి లేదు. తవ్వేశారు. అస్థికలు మేం ఉంటున్న మంచం కింద వున్నాయి"అని చెప్పింది. ఏమీ కొత్త మనిషితో మాట్లాడుతున్నట్లు అనిపించలేదు. ఎన్నో ఏళ్లుగా ఎరిగున్న మనిషి లాగ అనిపించింది. మా అడ్రస్ తీసుకొని, ఉత్తరాలు రాస్తానని, మమ్మల్ని కూడా ఉత్తరాలు రాయమని చెప్పింది. ఆ తరువాత మా వూరు పామర్రు వచ్చింది. మాతో పాటే, మేం ఏం తింటే అదే తినేది. మా ఇంట్లో మనిషిలాగ కలిసిపోయింది. మా కష్టం,

సుఖం కనుక్కునేది. ఓ సారి – మేం కొంచెం డబ్బు కష్టాల్లో ఉన్నామని తెలుసుకొని, “నా దగ్గర 50 వేలు వున్నాయి. కావాలంటే, ఇస్తాను “అంది.

“అక్కరలేదు. మీరు అంత మాట అన్నారు. అదే చాలు “ అన్నాను. నేను రిప్లయ్ రాసినా, రాయకపోయినా తాను మాత్రం రెగ్యులర్ గా ఉత్తరాలు రాస్తుండేది. ఎప్పుడన్నా తను ఫోన్ చేస్తుండేది. ఇంగ్లీష్ లో అనర్గళంగా మాట్లాడేది. తనకి జబ్బుగా ఉందని తెలిసి చాలా బాధ పడ్డాను. భీమిలి ఆశ్రమం నుండి ఒకసారి ఫోన్ చేసింది “రమ్మనమని”. జబ్బుతో వున్న ఆమెను చూసి తట్టుకోలేనన్న భయంతో వెళ్ళలేకపోయాను. ఆ విషయం గురించి, ఇప్పటికీ బాధ పడుతుంటాను. ఆమెకి వున్న తీరని కోరికలు.

చలంగారు నివసించిన ఇల్లు తిరిగి కొని, దాన్ని మళ్ళీ పునరుద్ధరించి, చలం మ్యూజియంగా ఏర్పాటు చెయ్యాలని. ఆయనకు సమాధి నిర్మించి, దాని చుట్టూ రక్షణ కల్పించాలని. “చలం గారి సమాధి మాత్రం నేను ఉండగానే ఏదో విధంగా ఏర్పాటు చేశాను” అని చెప్పింది. నాకున్న కొద్ది పరిచయంలోనే నర్తకి అంటే ఏం అనిపించిందంటే…. నర్తకి అంటే ప్రేమ, కరుణ, సాటి మనుషుల పట్ల జాలి, సాయం చేసే స్వభావం. మళ్ళీ ఒక చలాన్ని చూడలేం అన్నట్లే, మళ్ళీ ఒక నర్తకిని చూడలేం.”

“ధన్యవాదాలు భార్గవి గారూ!”

మరిన్ని వివరాలు తరువాత భాగంలో….

★★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 మే 14 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS